# ఎంత దయో ఏలో్నళ్లకు?

''మింగను మెతుకు లేదు. మీసాలకు సంపంగి నూనె! - అన్నెట్టుగా ఈ యీరాపులకేం తక్కవ లేదమ్మా? నిద్దర పడక మింద ఉండంగానే యింటి చుట్టు పెళ్లు చుట్టా ఉడ్డగట్టి నిలబడ్డారు- 'మేలుకొలుపులు పాడేదానికి! తన్నుమాల్నె దర్మాలు మనకెందుకంటే యినిపించుకుండేటట్టుగా ఉండే ఈ కొంప యిట్టెందుకుంటింది. నలగర్తో దీటుగా నేను గూడా దినానికొక చీరగట్టి వారానికొక నగమార్సేదాన్ని. దేనికైనా రాసి పెట్టుండాల గదా? నాడు రాసి పెట్టంది నేడు రమ్మంటే యాణ్ణుంచి వస్తింది?''

మా బాశాలి సాగతం మాదిర సొణుక్కుంటా వచ్చి-

''ఎంత పాలుమారికమ్మా ఈ మొగోడికి? తెల్లవాదులూ నిలికిలేని సేద్దింగదా? చెప్పుకుంటే సిగ్గుచేటు. యదవముండల దగ్గిరుండే ఎత్తుబారం కొంపలో కొచ్చేకుందికి చప్ప జల్లారిపోతింది.''

నేను యినాలనే గెట్టిగానే అనె. నేను యినీ యిన్నోడి మాదిర పడక మింద అట్టపొల్లతా యిట్టపొల్లతా ఉంటే-

''లెయ్యండి! లెయ్యండి!! లేచి ఆ కొంప ముందరట్టా చూడండి.''

ఇంట్లో చెత్త శాటనిండికెత్తి ఈదిమింద ఎదజల్లినట్టు మా బాశాలి నామింద యాష్ట ఎలబోసె.

తెల్లారేకాడికే కొంపముందర చూడమంటా ఉండాదే? ఏం ముంచుకోని వచ్చిందో ఏంపాడో? అన్న అనుమానం కలిగె. ఎందుకంటే నేనుండేది బండ్ల యీదిలో!

బండ్ల యీదికి కొంత చరిత్ర పాడూ పద్దేశిం ఉండాది.

ఒకప్పుడు తిరపతిలో అది యాడైనాసరే! వాడు ఎవుడ్డైనా సరే! యిల్లు గిల్లు కట్టుకోవాలనుకుణ్ణా... పాత కొంపలైతే వచ్చిందీ పొయ్యిందీ సరి చేసుకోవాలను కుణ్ణా- దానికి ఏరప్పోరాయో యిసికో గిసికో కావాలగదా? వాటిని తోలించు కోవాలంటే రొండెద్దల బండ్లేగెతి. ఆ బండ్లు ఉండే దెక్కడ? మా యీదిలో. అప్పుడు వాళ్ల కతలు యాడికుణ్ణాయంటే- ఒక్కదినం బాడిగ దొరికితే చాలు ఆడికే బెమ్మానంద పడిపోతా ఉండ్రి. బండ్లుండే వాళ్ల కతలు ఆడికైతే కరిణె బొడ్లో దోపుకోని నాలుగ్గాళ్లమండపం కాడికి పోకుండా బోతే కొందుర్కైతే నాలుగేళ్లు నోట్లోకి పోవు. అటు మంటోళ్లంతా యిప్పుడు బండ్ల కెత్తలేనంత ఆస్తిమంతులై పాయ్‌నారు. ఈ మణిసి జల్మాలకు దుడ్లు మస్తుగా చేరేకుందికి వాటిమింద మరీ ఆశ పుట్టి పొయ్యేటట్టుగా ఉండాది. ఇల్లు ఈడ్సి కొలిస్తే గోసిపేతంత కూడా ఉండదు. అయినా సరే! ఆ యింటిముందర అంతో యింతో కాళీజాగా ఉంటే సాలు!! వాటిని వాటం చేసేది. పండ్ల మండీలకు బాడిగలకిచ్చేసేది.

బండ్ల యీది యిప్పుడు పండ్ల యీదిగా మారి పొయ్యింది.

ఈ పండ్ల మండీల వాళ్లుండారే? శానా ఫలాతన్ నాయాండ్లు. ఆ మండీల్లో పడే చెత్తా చెదారాన్ని అట్టా యిట్టా చూసి మున్సిపాల్టీ సైడుకాలవల్లో కుమ్మరించేస్తారు. తప్పేదారీ గెమనించి ఎవుడైనా నోరు తెరిస్తే కాలవలుండేది ఎందుకంటా ఎదురు తిరగతారు? ఆ కాలవలు గూడా చేతికి దొరికింది దొరికినట్టుగా చెడీ బడీ పెరక్కతినే కద్దరు గుడ్డల కింది కడుపుల మాదిర నిండిపోతే సందుచూసుకోని ఏ కొంప ముందర్నో పారజల్లేస్తారు.

అట్టామాదిర ఎవుడైనా ఒక దొంగ యదవ చెత్తా చెదారాన్ని కొంప ముందర పారజల్లేసినాడో? అదీ గాకుండాబోతే మున్సిపాల్టీ పనోళ్లు ఉణ్ణట్టుండి మొరాయిస్తే మొబ్బామోడం లేకుండానే కాలవలు పొంగి పొర్లి పార్తా వుంటాయి. కొంపదీసి ఆ పొంగడం పొంగడం మా కొంప ముందర్నే పొంగి మా వాకిటికే ఎసురు పెట్టిందేమో? లేకుండాబోతే మా బాశాలి కొంప ముందర ఎందుకు చూడమంటింది? అని ఆలోచించుకుంటా పైకి లేచినా. ఒగిటే ఆవిళింపులు. ఒళ్లిరుచుకుంటా వాకిట్లోకి నడ్సినా. ఈదిలో కల్లా చూసినా! చూసిన కండ్లు చూసినట్టే నీలుక్కోని పాయ!

తెర్సిన నోరు తెర్సినట్టే ఉండిపాయ!

ఎందుకంటారా? మా ఊరికి దిగ ఊళ్లో శీపరమోళ్ల ఎర్రమరెడ్డి మా యింటిముందర కాడ నిలబడుకోనుండాడు.

ఎర్రమ రెడ్డి- అంటే ఎవురనుకుణ్ణారు?

శీపరమోళ్లది ఆ పాయికట్లో చిన్న సంసారంగాదు. ఏడుమడకల సేద్దిం. ఎప్పుడూ

ఎనిమిది పదిమంది ఏదో ఒక పని మింద ఉంటారు. వాళ్లకు సద్దెత్తుకోని పోవాలంటే ఏతంబానంత బాన... సంగటెత్తుకోని పోవాలంటే వొక బొట్టంత గంప కావాల్సిందే. మడికాడ అట్టయిందా? ఇంక యింటికాడ. గాడిపొవ్వల మింద ఎక్కేబానలు ఎక్కతా ఉంటే దిగే బానలు దిగతా ఉంటాయి. వచ్చినోళ్లకు వండిపెట్టి రానోళ్లకు ఎదురుచూస్తా ఉండేది ఆ యింటి మట్టసం!

అటువంటి యింటికే తల ఎర్రమరెడ్డి?

చెయ్యెత్తు మణిసి. చేతికి ఎమిక ఎక్కడుండాదని ఎతుకులాడాల్సిందే. ఆ పాయికట్లో పెండ్లి పేరంటాలకు నగానట్రా కావాలనుకుణ్ణా... చావుకో దినాలకో అప్పోసప్పో అవసరమయినా ఆ యింటి గడప తొక్కాల్సిందే. ఎనుకూ ముందు చూడకుండా ఎర్రమరెడ్డి ఎగెయ్యాల్సిందే!

శీపరమోళ్ల యింట్లో పుట్టకలు! ఎందుకులే తండ్రీ! పాత చింతపాండు రంగే ఒకమట్టు మేలుగదా? అయితే ఈయన మాత్రం ఎక్కిరించినట్టుగా ఎర్రంగా పుట్నాడు. అందువల్ల యింట్లో వాళ్లకు ఎర్రబ్బ ఊళ్లో వాళ్లకు ఎర్రమరెడ్డి అయినాడు. సుంగిడ్సి తలగుడ్డచుట్టి... పంచె మోకాళ్ల పైకి ఎగ్గట్టి... పార బుజానికి తగిలించుకోని పరాగ్గా నడస్తావుంటే కదిరి తేరు కదిలినట్టుండేది. చూసినోళ్లు వాళ్లా యీళ్లా 'ఓయబ్బా! ఎర్రమరెడ్డా!' అనేవాళ్లు.

అటువంటి ఎర్రమరెడ్డి! ఎవడో ఎర్రోడిమాదిర మా యింటి ముందర నిలబడుకోనుండాడు. నాకండ్లలో గిర్రని నీళ్లు తిరిగె. తమాయించుకుంటి. ఎగిరిపాయ్ ఆయన ముందర పణ్ణెట్టు పడ్తి. రొండు చేతులు జవిరి పట్టుకుంటి.

''ఏం? ఎర్రన్నా! ఎట్టుంణ్ణోడివి? యిట్టయిపోతివే?'' అన్నెట్టుగా కండ్లల్లో కండ్లుబెట్టి చూస్తి.

ఎర్రమరెడ్డి తలవాలిపాయ!

తలబాగా మాసింది. పిడ్సగట్టక పొయ్యుండాది. గెడ్డం గీసుకోని ఎన్నాళ్లయిందో? వానాకాలంలో గెనిమిలమింద గెరిక మొల్సినట్టు పెరిగి పొయ్యుండాది. గూనొంగిపాయ్ మణిసి గువ్వ అయినాడు. చెయ్యెత్తు మణిసి చేతిలోకి చాలడనిపిస్తా ఉండాడు. ఆ ఎర్రమరెడ్డి ఎక్కడ? ఈ ఎర్రమరెడ్డి ఎక్కడ? ఎలిక్కి ఏనిక్కి ఉణ్ణెంత తేడా ఉండాది. అని అనుకుంటానే-

''ఇంట్లోకి పోదాం రా ఎర్రన్నా?'' అని పిల్సినా.

''ఒరే అబ్బోడా! నీ యింటి గడప తొక్కినా. తలుపు తట్నా. తలుపు దీసింది నీ బాశాలి మాదిరుండాది. తొంగి చూసింది. ఏమనుకుణ్ణిందో ఏమో? తీసిన తలుపు తీసినట్టే మల్లా ఏసుకుండె.''

ఒక మాదిరిగా చూస్తా యింకొక మాదిరిగా నవ్వె.

ఆ నవ్వు ఎట్టుండాదంటే? -

''ఒరే! నీ మొకం బయిశారా? ఆడదాన్ని అదుపులో పెట్టుకోలేని బతుకు అదీ ఒక బతుకేనా?'' అని నిలదీసినట్టుండాది.

అయినా తమాయించుకోని-

''ఎర్రన్నా! నువ్వు ఎంత మారిపొయ్‌నావు. ఏం కత? నేనే నిన్ను గుర్తుపట్లేకుండా పోతినే. ఇంక ఆపె టవున్లోపుట్టి పెరిగింది...''

నానోట్లో మాట నోట్లో ఉండంగానే-

''అదేరా అబ్బోడా! అదే. అందుకే నేను రానంటా ఉండేది. ఈ జల్మానికి ఒకడు నా గడప తొక్కాల్సిందే గానీ నేనొకడి గడప తొక్కరాదనుకుణ్ణా. ఈ పొద్దుటితో అదిగూడా అయిపొయిందిరా! అయిపొయింది!''

ఇంక మాట్లాడలేనట్టుగా మొకవట్టా తిప్పేసె. ఎట్నో చూస్తా నిలబడె.

''ఎర్రన్నా! నీకు తెలియంది ఏముండాది? ఓడలు బండ్లవతాయి. బండ్లు ఓడలవుతాయి.'' అని అంటినో లేదో-

''ఒరె వొరె వొరె! ఆడికి నిలపరా అబ్బోడా! నిలుపు. ఈ యాదంతం యినీ యిని తలకాయి బట్టగట్టి పూడ్సింది. నీతో రొండంటే రొండేమాటలు. మాట్లాడేసి పోదామని పలుబాట్లుబడి వచ్చినా. నాలుగంటే నాలుగడుగులు. నాతో గూడా నడువు. అంత లోపల్నే ఆ రొండు మాట్లు నీ చెవల్లో యేయేస్తా. ఆ మిందట నీతలపాడు'' అంటానె ఎలబారె.

ఆయన గడప తొక్కడమే ఒక అరుసోద్దిం. పిలిస్తే పోకుండా ఉండేదానికయితిందా? ఎంట పడ్తి.

''అబ్బోడా! నేను ఎట్ల బతికినానో నీకు ఎరిక లేకుండాబోతే ఎచ్చులు చెప్పుకోవాల. ఇప్పుడదెంతా ఎందుకు? గెలిగేదానికి మొదులు బెట్టే తొవ్వి తలకెత్తుకుండే యవారమే అయితింది. బూదేవిని నమ్ముకుండేంత బుద్దిలేని పని యింగొగిటి లేదురా!'' అనె.

''పుడమితల్లిని నమ్ముకుంటే పూటకు లోటుండదంటారే? యిదేందబ్బా? ఈ మణిసి యిట్టా మాట్లాడ్తా ఉండాడే?'' అని ఆయన మొకంలోకి ఒకమాదిరిగా చూస్తే-

''ఎందుకురా అబ్బోడా! అట్టచూస్తావే? నేను చెప్పేదాంట్లో చింతాకంత అపద్దం లేదురా. ఏడెనిమిదేండ్లుగా యాడాదికేడాదికి వాన మట్టగించి పోతావుండాదా? చెరువు నిండిదెప్పుడు? నేను చిన్నపిలగాడుగా ఉణ్ణెప్పుడు చూసిందేగదా? చెరువు నిండకపోతే పొయ్యింది. బావల్లో నీళ్లు? బానకు బాన అందేదే గగనమై పాయ. ఆకాశిగంగ అట్ట పాతాళగంగ యిట్టా వాటితాళ్లు తెంచుకుంటే మాతాళ్లు తెగిపోతా ఉండాయిరా. సేద్దాలు మట్టగిల్లె. తినేదానికి తిండిలేక పాయ. గొడ్డూ గోదకంత కసువు కరువైపాయ. బతికిన బతుకుల్ను తల్సుకోని యేడవాల్నా? ఇంక బతకబొయ్యే దెట్టని యాడవాల్నా?

దిక్కుతోచకుండా దిగులుపడి చస్తావుంటే ఈ సర్కారోళ్లొచ్చిరి. సొసైటీలన్రి. షేర్లన్రి. నగానట్రా కుదవబెట్టి కట్టిమి. కట్టే ఏమాయ? తిప్పించు కున్నన్నినాళ్లు తిప్పించుకుండ్రి. కడాన తిరిపానికి పెట్నెట్టు అంత చేతిలో పెట్రి.

చేతల్లో ఉణ్ణిందీ చేతికిచ్చిందీ రొండిట్ని జతచేర్సి బాయి తొవ్వితే దాంట్లో బండపడె!

బాయిలో బండపడె. బక్కోద్దు నేలపడె. బూములు బీడుపడె. ఈ అప్పులు నెత్తిన పడె. పల్తానికి పల్తానికి సావలాపరక చేతికొస్తా ఉంటేనే బతుకులు ఆడికాడికుండె. పల్తిం కండ్ల చూసి ఏండ్లు పూండ్లు అయిపోతావుంటే యింకేం పెరుక్కోని తినాల? ఎట్ట బతకాల? అని యాదనపడి చస్తావుంటే మొగుడు చచ్చి మొత్తుకుంటా వుంటే మిండగాడొచ్చి రాళ్లేసినట్టు ఈ సొసైటీ వాళ్లొచ్చి గొంతలమింద కూసుండ్రి. అప్పుగట్టి కదలమంటే ఎట్టగట్టాల? యాడదెచ్చి కట్టాల? కట్టకుండాబోతే చెంబూ తబిలెత్తి యీదుల్లోకి యిసిరి కొట్టానన్రి. గొడ్డూగోదా వుంటే జప్తీ చేస్తానన్రి. బతికినంత బతుకూ బతికి బతుకిట్లా బయిశాట్లపాలై పూడిస్తే యింక బతికేదెందు కనిపించె. పోనీ! పెండ్లాం బిడ్డల్ను అందుర్నీ కట్టగట్టి తోసేసి వాళ్లతో గూడానే ముడుక్కుందామంటే బావల్లో నీళ్లుండి చస్తేగదా? కొడుకు చేసిన శాతలకు అబ్బ బందేరాకు మోసినట్టంటారు. కాదురా అబ్బోడా కాదు. అబ్బ చేసిన శాతలకు కొడుకు బందేరాకు మోసినట్టు యవ్వారం తిరగబడి పాయ. బూదేవిని నమ్ముకోరా! బువ్వకు లోటుండదని మా అయ్య అంటే నమ్ముకుంటి. నమ్ముకుంటే ఏమాయ? నమ్మి నానబోసుకుంటే పుచ్చిబుర్రలాయ. మూడుం ముక్కాలు దుగ్గాణికి దాన్నట్టా తొల్సిపారేసి ఈడ యాడన్నా ఒక టీ అంగిడి పెట్టుకోనుంటే గూడా నిమ్మళతిగా బతికి పొయ్యుండచ్చు. ఏం చేద్దాం? అది తాతముత్తాతలు సంపాయించి పెట్టిన మట్టి. ఆ మట్టిమింద మమకారాన్ని చంపుకోలేము. చంపుకుణ్ణా బతకలేము. అమ్మ పాలిచ్చినంత కాలం యిస్తింది. ఇప్పుడిచ్చేది లేదు గదాని యిడ్సి పెట్టేస్తామా? ఇడ్సి పెట్లేక... పెట్టుకోని బతకలేక బతుకు చావుజంపులై పోతావుండాదిరా!''

ఇంక ఏమీ చెప్పలేనట్టుగా చెప్పేదానికేమీ లేనట్టుగా ఎర్రమరెడ్డి నిట్టూరస్తా నిలబడె. అప్పుడు తలపైకెత్తితి. ఎదురుంగా నాలుగ్గాళ్లమండపం. ఆ మండపంలో టీ అంగిడి-

''ఎర్రన్నా! అంత టీ అన్నా తాగేమే?'' అంటే-

''టీ తాగినంత పుణ్ణెంరా అబ్బోడా! నువ్వు యిప్పుడంత ఎసులుబాటుగా ఉండావని యింటి. ఆ సొసైటీ వాళ్లొచ్చి నెత్తిన కూసోనుండారు. ఈ బొళువట్టా దింపేసేదానికి చూడ్రా. బతికి బాగుంటే నీ రుణాన పోను. చస్తే నీ కడపన పుట్టి తీరస్తా.''

ఏడవన్ని వొగిటే తక్కవ ఎర్రమరెడ్డి.

''అయ్యయ్యో! ఎందుకంత మాటగానీ ఎర్రన్నా? నీకు తెల్సునో తెల్దో? నేను చెప్తావుండా యిను. ఈ సొసైటీ అప్పులు మీరు యిప్పుడిప్పుడే కట్టాల్సిన పన్లేదు. మూడేండ్లుగా కరువుండే తావుల్లో అయితే ఏడేండ్లుదాకా కట్టాల్సిన పన్లే. అంతకు పైబడ్తే ఆ అప్పులజోలికి పోవాల్సిన అవసరమేలే.''

''ఇది అచ్చిరాలా నిజిం పెద్దాయినా!'' అంటా ముత్తారెడ్డన్న ఆడికొచ్చె.

నన్ను ఎగాదిగా చూసె. అదొక మాదిరిగా నవ్వె!

నాగుండె గబీమనె. అయినా నిలదొక్కుకోని నిలబడ్తి. ఆ మణిసి మాట మాటగాదు. ఏమంటాడో ఏమో అని ఒకపక్క పీకతానే ఉండాది.

''పెద్దాయినా! ఏల్నోళ్లకు ఎంతదయో మీమింద! మీరంతా దేశానికి ఎన్నెమికలంట. మీ వల్లనే పొద్దుపుట్టి తెల్లార్తా ఉండాదంట. మీ వల్లనే రాజ్జిం ఈదశ కొచ్చిందంట. అబ్బబ్బ! మొన్న ఆ అయిద్రాబాద్‌లో మారాజులు సుంగిడ్సిన తలగుడ్డలు కిరీటాల మాదిర పెట్టుకోని మాట్లాడిందంతా మీకతలే గదా? ఆ మాట్లకే ముర్సిపాయ్ చేతులు తట్తా వుంటే మన ప్రెదాని రాజీవ్‌గాంధీ వాయిదాలేసి పారేసె. ఇంక అప్పులు గట్టలేకుండా మీరిప్పుడు ఆత్మహత్తెలు చేసుకోవాల్సిన అవసరమే లేదు. వాటికి వాయిదా పడిపాయ. ఎప్పటుకి? ఏడేండ్లకో... పదేండ్లకో?''

''ఏందన్నా నువ్వనేది? వాయిదా పడింది ఆత్మహత్తెలకే నంటావా?'' అని అంటే–

''కాకుండాబోతే యింకేందిరా అబ్బోడా! కోట్లు కోట్లుగా దెచ్చి యీళ్లనెత్తిన కుమ్మరించినారంట. కుమ్మరించిందంతా ఎట్టబొయ్యింది. ఎర్రమరెడ్డి బతుకు ఎందుకిట్లయిందో చెప్పరా చూద్దాం. 'అప్పులు కట్టలేకుండా చస్తావుండామయ్యా!' అంటే ఆ అప్పులు తీర్సే వాటంవైనం ఎట్నో ఆలోచించకుండా వాయిదా యేసినామంటే అదేందది? ఇప్పుడు చావాల్సిన పన్లేదు. ఎప్పుడో ఏడేండ్లకో పదేండ్లకో మాటగదా? అప్పిటిమాట యిప్పుడెందుకని గదా ఈళ్లదిమాకు? అదిగాకుండా యిప్పిట్లో ఒకడు చచ్చినా చచ్చినట్టే! ఒక వోటు తగ్గినా తగ్గినట్టేగదా లెక్క. అంటే దీని అర్తం ఏంది? ఆ ఓటు ఏసేసి మల్లాగావాలంటే చావండనే గదా?''

పెసరకాయివొల్సి చేతిలో పెట్నెంత లేసుగా అనేసి ఆయన్న తన దోవన తాను పాయ.

ఎర్రమ రెడ్డికి ఏమి చెప్పాల్నో? ఎట్ట చెప్పాల్నో? తోసకుండా ఆ నాలుగ్గాళ్లమండపం కాడ నిలబడుకోని నలబై యిదాలుగా ఆలోచించుకుంటా ఉండా! ●